క్లుప్తంగా

నీటి కాలుష్యం నివారణకు కృషిచేయాలి



మొక్కలను తొలగించివేస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ: ప్రతి ఒక్కరూ నీటి కాలుష్యం నివారణకు కృషి చేయాలని ఆర్జీ–2 ఎస్‌వోటూ జీఎం వెంకటేశ్వర్‌రావు అన్నారు. వచే నెల నిర్వహించనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మిషన్ లైఫ్‌స్టైల్ ఎన్విరాన్మెంట్‌లో భాగంగా గురువారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ అల్లూరు గ్రామంలోని చేరువు కట్టపై పెరిగిన పిచ్చిమొక్కలను జేసీబీ సాయంతో తొలగించారు. అఫిషియేటింగ్ డీజీఎం పర్సనల్ అండ్ అధికార ప్రతినిధి ఎస్.అనిల్‌కుమార్, ఏరియా సర్వే అధికారి బుాక్య దేశాయి, పర్యావరణ అధికారి సురేశ్‌బాబు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో గురువారం శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక ఆలయ వీధుల గుండా శ్రీవేంకటేశ్వర స్వామి, పద్మావతి, అలువేలు మంగ ఉత్సవ విగ్రహాలను రథంపై ఆసీనులను చేసి భక్తుల కోలాటల మధ్య ఆలయ వీధుల్లో ఊరేగించారు. భక్తులు రథంపై మొక్కులు చెల్లించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రథోత్సవంలో ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్, మాజీ సర్పంచ్ సంతోష్‌రావు, కుంట రాజేశ్వర్‌రెడ్డి, కామరాజు, నోముల గోపాల్‌రెడ్డి, దిడ్డి శంకరయ్య, వెంకటేశం, ఆలయ పూజారి బండవరం రామానుజం, స్వామి పాల్గొన్నారు.

శ్రీలక్ష్మినర్సింహస్వామి ఆలయంలో..

ధర్మారం: మండలంలోని పత్తిపాక శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడు రోజులుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజు రథోత్సవ కార్యక్రమాన్ని భక్తుల కొలాహలం మధ్య ఘనంగా నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగరావు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. పత్తిపాకతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు తరలివచ్చారు.

స్నేహితుడికి చేయూత



నగదు అందిస్తున్న స్నేహితులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన ఎండీ యాకబ్ అనారోగ్యంతో పదిరోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా 2002–03లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాకబ్‌తో పాటు చదువుకున్న అతడి స్నేహితులు గురువారం రూ.20వేల నగదు అందించారు. శ్రీనివాస్, సురేశ్, రాజ్‌కుమార్, స్వామి, శ్రీకాంత్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



సాయం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

సాక్షి, పెద్దపల్లి: శివరాత్రి రోజు జరిగిన అగ్ని ప్రమాదంతో దగ్ధమైన మూడు షాపుల యజమానులకు ఆర్థికసాయం అందించారు. గురువారం పెద్దపల్లి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా సేకరించిన మొత్తం ఆర్థిక సాయాన్ని ముగ్గురు షాపుల యజమానులకు శారద కాంప్లెక్స్ వద్ద జరిగిన కార్యక్రమంలో అందించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ మస్రత్, అధ్యక్షుడు కమల్ కిషోర్ శారద, ఉపాధ్యక్షులు మాదూరి వినోద్ కుమార్, కోశాధికారి జయప్రకాశ్, మిట్టపల్లి మధునయ్య, శ్రీనివాస్, సదానందం పాల్గొన్నారు.

దుకాణం ఎదుట మహిళ నిరసన

జ్యోతినగర్: ఒక వివాహిత మహిళ ఒక కిరాణం గురువారం రాత్రి ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లి సెంటర్‌లోని ఓ వ్యాపారి దుకాణం ఎదుట నిరసన చేపట్టింది. స్థానికుల సమాచారంతో బ్లూకోల్ట్స్ పోలీసులు మహిళ వద్దకు చేరుకుని వివరాలను తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, అనంతరం న్యాయం చేయడానికి వీలవుతుందని వారు తెలిపారు.

ఇసుక తరలింపుపై నిఘా

- కాటారం–పెద్దపల్లి రహదారిలో రెవెన్యూ, పోలీస్ అధికారుల తనిఖీలు

మంథని: నేషనల్ గ్రీన్ ట్రిబునల్ ఆదేశాల మేరకు మానేరు నది నుంచి ఇసుక తరలింపు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేయడంతో గురువారం రెవెన్యూ, మైనింగ్, పోలీస్‌శాఖ నిఘా పెట్టింది. కాటారం–పెద్దపల్లి రహదారిలో రెవెన్యూ, పోలీస్ అధికారులు ఇసుక వాహనాలపై నిఘా పెట్టారు. రెండు ఇసుక లారీలను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించిన అధికారులు సరైన రికార్డులు ఉండడంతో వదిలివేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా అన్నారం ఇసుక క్వారీ నుంచి వస్తున్న లారీలను తనిఖీ నిర్వహించారు. లారీల తనిఖీతో కాటారం–మంథని దారిలో పెద్ద ఎత్తున లారీలు నిలిచిపోయాయి. మానేరు నది నుంచి ఇసుక తవ్వకాలు, రవాణా లేకుండా అధికారులు ఆదేశాలు జారీ చేశారు.



తనిఖీ చేస్తున్న అధికారులు

కార్పొరేషన్ సుందరీకరణకు చర్యలు



పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ సుందరీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. గురువారం కార్పొరేషన్ 23వ డివిజన్ సుభాష్‌నగర్, ఆటోనగర్ ప్రాంతంలోని మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. వర్షాకాలం రాబోతున్న క్రమంలో వర్షపు నీరు ఇళ్లలోకి రాకుండా కాలువల్లో పేరుకుపోయిన మట్టిని స్పెషల్ డ్రైవ్ చేపట్టి తొలగించనున్నట్లు పేర్కొన్నారు. మూడురోజుల పాటు కాలువల మట్టి తొలగింపు పనులు కొనసాగనున్నట్లు స్పష్టం చేశారు. ప్రజలు తమ ఇళ్ల నుంచి వచ్చే చెత్తను మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ఇంటి వద్దకు వచ్చిన సమయంలో వారికి ఇవ్వాలని సూచించారు. ఇష్టానుసారంగా బయట పారవేయడం, కాలువల్లో వేయడంతో కాలువల్లో మట్టి నిండి వర్షాకాలం వచ్చే వరద నీరు ఇళ్లలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించి పట్టణం సుందరీకరణలో భాగస్వాములు కావాలని కోరారు. 15 మంది పారిశుద్ధ్య సిబ్బంది పనులు చేస్తున్నట్లు వెల్లడించారు. డిప్యూటీ కమిషనర్ త్రయంబకేశ్వర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, సూపర్‌వైజర్ సంపత్ పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయం బోర్డుపై జిల్లా పేరు



పెద్దపల్లి జిల్లా పేరున్న బోర్డు ఏర్పాటు

జ్యోతినగర్: రాష్ట్రంలో జిల్లాలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నప్పటికీ రామగుండం తహసీల్దార్ కార్యాలయం బోర్డుపై జిల్లా పేరు లేకపోవడంతో 'తహసీల్ కార్యాలయం బోర్డుపై జిల్లా పేరేది' అనే శీర్షికన గురువారం కథనం ప్రచురితమైంది. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. కార్యాలయం బోర్డుపై పెద్దపల్లి జిల్లా పేరును రాయించారు.

సాక్షి ఎఫెక్ట్..

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



తనిఖీ చేస్తున్న ఎస్సై స్వామి, ఏవో ప్రకాశ్

పాలకుర్తి: రైతులు లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, ఎవరైనా నకిలీ విత్తనాలు, లూజ్ విత్తనాలు అమ్మితే చట్టపరంగా కఠినచర్యలు ఉంటాయని బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు. గురువారం పాలకుర్తి మండల వ్యవసాయాధికారి ప్రకాశ్‌తో కలిసి మండల పరిధిలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్, సీడ్స్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, బిల్లులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరంలో పత్తి విత్తనాల ప్యాకెట్ ధర రూ.864గా ఉందని, ఇంతకు మించి ఎక్కువ ధరకు విక్రయిస్తే సంబంధిత షాపు డీలర్‌పై తగిన చర్యలు తీసుకుంటామని, హెచ్‌టీ విత్తనాలు విక్రయించరాదని సూచించారు. ఎవరైనా గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు అమ్మితే తమకు సమాచారం అందించాలని ఎస్సై స్వామి అన్నారు.

కాల్వశ్రీరాంపూర్: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనాథ్ అన్నారు. కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల విత్తన, ఎరువుల డీలర్లతో గురువారం మండల కేంద్రంలో వానాకాలం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారులు, డీలర్లు ఉన్నారు.

మలుపు వద్ద బారికేడ్స్ ఏర్పాటు



బారికేడ్స్ ఏర్పాటు చేస్తున్న ఎస్సై బోయ వెంకట్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట రైల్వేగేటు సమీపంలోని మూలమలుపు వద్ద ప్రమాదాల నివారణకు గురువారం అంతర్గాం ఎస్సై బోయ వెంకట్ నేతృత్వంలో గ్రామ ప్రతినిధుల సహకారంతో బారికేడ్స్ ఏర్పాటు చేశారు. ఇటీవల ఓ కారు మూలమలుపు వద్ద అదుపు తప్పి తుమ్మ పొదల్లోకి దూసుకెళ్లిన విషయం తెలిసిందే. కాగా ఇదే ప్రదేశంలో పలువురు ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలపాలైన ఘటనలున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని వాహనదారులు మూలమలుపునకు చేరుకునే ముందే బారికేడ్స్ ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడంపై ఎస్సైని పలువురు అభినందించారు. గ్రామ ప్రతినిధులు సింగం కిరణ్‌కుమార్ గౌడ్, కొలిపాక మధుకర్‌రెడ్డి ఉన్నారు.

ప్రపంచ జ్ఞానజ్యోతి గౌతమ బుద్ధుడు

గోదావరిఖనిటౌన్: ప్రపంచ గమనాన్ని మార్చిన జ్ఞాన జ్యోతి గౌతమ బుద్ధుడని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బొంకూరి మధు అన్నారు. వైశాఖ బుద్ధ పూర్ణిమ సందర్భంగా గౌతమ బుద్ధుని జయంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక తెలంగాణ అంబేద్కర్ ట్రస్ట్ భవన్‌లో జరిగిన జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. సంఘం నాయకులు కిష్టయ్య, బొందయ్య, రవికుమార్, నవీన్ పాల్గొన్నారు.

జూలపల్లి/ఎలిగేడు: మండలంలోని వడ్కాపూర్ శివారులో ఉన్న అత్యంత ప్రాచీన బౌద్ధ స్తూపం వద్ద గురువారం బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు బుద్ధుని విగ్రహం ముందు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఓదెల: మండలంలో బుద్ధ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి రత్నం ఆధ్వర్యంలో కొలనూర్ పంచాయతీలో జయంతి వేడుకలు జరిపారు. మాజీ సర్పంచు సామ శంకర్, మాజీ ఎంపీటీసీ దొడ్డె శంకర్, బహుజన సంఘం ఐడియాలజీ సాత్తూరి అనిల్, నాయకులు సాత్తూరి రాజేశం, తొటం జన్నయ్య, దిలీప్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నిబంధనలు పాటించకుంటే చర్యలు

మంథని: మంథని కూరగాయల మార్కెట్‌లో నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ అన్నారు. గురువారం మార్కెట్‌ను సందర్శించారు. మార్కెట్‌కు వచ్చే వారికి అసౌక్యం కలగకుండా చూడాలని, కేటాయించిన స్థలంలోనే వ్యాపారులు విక్రయాలు చేయాలని సూచించారు. రోడ్డుపై అమ్మకాలు చేయొద్దని సూచించారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులకు అవకాశం ఉంటుందని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

రామగిరి: పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మంథని డీఎల్‌పీవో శంకర్ అన్నారు. మండలంలోని నాగెపల్లి గ్రామంలోని క్రీడా ప్రాంగణం, సెగ్రిగేషన్ షెడ్డు, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, నర్సరీలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. కార్యదర్శులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. తాగునీటి ఎద్దడి రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యదర్శి సంతోష్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోదావరిఖనిటౌన్: పట్టణంలో పలు ఏరియాల్లో శుక్రవారం 11కేవీ లైన్ల మరమ్మతు పనుల కారణంగా ఉదయం 8గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కె.సంపత్ తెలిపారు. పట్టణంలోని రాంమందిర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మేదరిబస్తీ, శివాజీనగర్, లక్ష్మీనగర్, కల్యాణ్‌నగర్, అలాగే పీజీ సెంటర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్, ప్రశాంత్‌నగర్, శ్రీనగర్‌కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు వేయొద్దు

సుల్తానాబాద్: ప్లాస్టిక్ కవర్లను డ్రైనేజీల్లో వేయొద్దని మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ కోరారు. పట్టణంలోని రాజీవ్ రహదారి వెంబడి డ్రైనేజీలను గురువారం ఆయన పరిశీలించారు. గురువారం ఉదయం వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో డ్రైనేజీల్లో నుంచి నీరు రోడ్డుపైకి రావడంతో పట్టణ ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. పలు ప్రాంతాలను సందర్శించి సూచనలు చేశారు. మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్, సిబ్బంది ఉన్నారు.

రక్షణ చర్యలు చేపట్టని కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలి

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా కొత్త భవనం నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆస్పత్రిలో భవన నిర్మాణ పనులను జిల్లా కార్యదర్శి కందుకూరి రాజా రత్నం, రాష్ట్ర సమితి సభ్యులు మద్దెల దినేశ్ పరిశీలించి మాట్లాడారు. భవన నిర్మాణం తవ్విన గోతిలో పడి ఇటీవల ఓ వ్యక్తి చనిపోయాడని, దీనికి కాంట్రాక్టర్‌తోపాటు అధికారులను బాధ్యులను చేయాలని డిమాండ్ చేశారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజయవంతం చేయాలి

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించే ఉమ్మడి జిల్లా స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను విజయవంతం చేయాలని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సెక్రెటరీ రాజయ్య కోరారు. జూలపల్లిలో గురువారం ఆయన మాట్లాడుతూ కీ.శే.దారబోయిన లింగయ్య యాదవ్ స్మారకార్థం ఆయన కుమారులు మాజీ సర్పంచ్ నర్సింహయాదవ్, మధుకర్ యాదవ్ నిర్వహించే పోటీల్లో క్రీడాకారులు పాల్గొనాలని కోరారు.

సత్యనారాయణకు నివాళి

జ్యోతినగర్: సీఐటీయూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పర్స సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో గురువారం వర్ధంతి సభ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.భిక్షపతి, సీనియర్ నాయకురాలు నాగలక్ష్మి, జిల్లా కోశాధికారి రామాచారి, ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కన్వీనర్ గిట్ల లక్ష్మారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల నివాళి అర్పించారు.

మ్యాన్ హోల్‌కు మూత బిగింపు



మ్యాన్ హోల్‌కు అమర్చిన మూత

జ్యోతినగర్: నిత్యం ప్రజలు సంచరించే రోడ్డుపై మ్యాన్ హోల్‌కు మూత లేకపోవడంతో 'ఆదమరిస్తే అంతే' అని 21న సాక్షిలో కథనం ప్రచురితమైంది. గురువారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీ రావూస్ లైన్‌లో ఉన్న మ్యాన్‌హోల్‌కు సంబంధిత అధికారులు స్పందించి సిబ్బందితో మూతను అమర్చారు. దీంతో స్థానికులు మున్సిపల్ అధికారులకు, సాక్షికి కృతజతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకునే చర్యలపై కర్మాగారంలో గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదం సంభవించినప్పుడు ఫైర్ సేఫ్టీ విభాగం అధికారులు, ప్రథమ చికిత్స విభాగం అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది స్పందించే చర్యలపై రెండు గంటలపాటు ఎమర్జెన్సీ సైరన్ మోగిస్తూ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం సుధీర్‌కుమార్ ఝా, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా డిమాండ్ చేశారు. గురువారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ఆస్పత్రిలో విధులు నిర్వహించే కార్మికులు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు యాజమాన్యం, కాంట్రాక్ట్ కార్మికులకు చేసిన అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు, అలవెన్సులను వెంటనే చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ టెండర్ ద్వారా రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టులో కాంట్రాక్టు పనులు పొందిన కాంట్రాక్టర్లు కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి వసతులు కల్పించడం లేదని ఆరోపించారు. సత్వరమే ఒప్పందం ప్రకారం వేతనాలు, అలవెన్సులు చెల్లించని పక్షంలో సమస్యను రీజినల్ లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. యాజమాన్యంతో పాటు పనులు పొందిన కాంట్రాక్టర్లపై చట్టపరంగా కేసులు వేస్తామని తెలిపారు. జీవో ప్రకారం స్కావెంజర్లకు అలవెన్సులు అందించాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి



జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కాంట్రాక్టు కార్మిక సంఘం నేత మద్దెల శ్రీనివాస్ కోరారు. ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల శ్రమదోపిడీ జరుగుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.21వేల నుంచి రూ.46వేల వరకు కేటగిరీ వారీగా వేతనాలు చెల్లించాల్సి ఉన్నా అవేమీ అమలు కావడం లేదన్నారు. నాయకులు సందీప్, శ్రీనివాస్, మహేందర్, లక్ష్మణ్, పాషా పాల్గొన్నారు.

ఎన్నికల్లో విధులను ఆన్‌డ్యూటీగా పరిగణించాలి



వినతిపత్రం అందజేస్తున్న సత్తయ్య

గోదావరిఖని: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన సింగరేణి ఉద్యోగులను ఆన్‌డ్యూటీగా పరిగణించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. గురువారం సింగరేణి డైరెక్టర్(పా) ఎన్వీకే శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన క్లరికల్, ఎస్అండీసీ సిబ్బంది విధులను ఆన్‌డ్యూటీగా పరిగణించి, టీఏ, డీఏ ఇవ్వాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం వారికి వేతనాలు అందించాలన్నారు. దీనిపై యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు వడ్డేపల్లి కుమారస్వామి, పుప్పాల నాగేంద్రప్రసాద్, బండి మహిపాల్, సాయికిరణ్ ఉన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాల పట్టివేత



అధికారులు పట్టుకున్న వాహనాలు

కమాన్‌పూర్: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ఐదు వాహనాలను గురువారం పట్టుకున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ సుధాటి కోటేశ్వర్‌రావు తెలిపారు. అక్రమంగా మట్టి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు కమాన్‌పూర్ క్రాస్‌రోడ్ వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఆర్డీవో హనుమా నాయక్ ఆదేశాల మేరకు వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

మట్టి తవ్వకాలకు పాల్పడితే చర్యలు

రామగిరి: మండలంలోని ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రాంచందర్‌రావు తెలిపారు. పన్నూర్ గ్రామంలోని జేఎన్టీయూ కళాశాల వద్ద ఐదు మట్టి లారీలను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయన వెంట గిర్దావర్ రాజాబాబు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మహిళల భద్రత కోసం షీ టీం

సాక్షి, పెద్దపల్లి: మహిళల భద్రత కోసమే షీ టీం పనిచేస్తుందని షీ టీం ఇన్‌చార్జి ఎస్సై రాజేంద్రప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో గురువారం విద్యార్థులకు భద్రత, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళల రక్షణ కోసం ప్రతిరోజూ బస్‌స్టేషన్, ప్రధాన చౌరస్తాలు, జనసమీకరణ ప్రాంతాలు, మాల్స్, కాలేజీల వద్ద షీ టీం నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే మహిళలు 63039 23700 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. షీ టీం ఏఎస్సై మల్లారెడ్డి పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

రామగిరి: మండలంలోని కల్వచర్ల సంతాన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ప్రధాన అర్చకులు కంజర్ల సాగరాచార్యులు ఆధ్వర్యంలో హోమ గుండాలను ఏర్పాటు చేసి హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కొలిపాక సత్తయ్య, రేండ్ల అశోక్, వేము కనకయ్య, అనవేని శ్రీనివాస్, మేకల మారుతి, పాలేటి కుమార్, ఆకుల శ్రీనివాస్, చారి, హరీశ్ పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం కన్నాల టోల్‌ప్లాజా వద్ద హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి పాల్గొని వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్, హెల్మెట్ వినియోగం గురించి వివరించారు. ఎస్సై శివాణిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌గౌడ్, కానిస్టేబుళ్లు సురేశ్, రమేశ్ పాల్గొన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న జీఎంలు

గోదావరిఖని: వైశాఖ పౌర్ణమి, బుద్ధ జయంతి, కూర్మజయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక బంగ్లాస్ ఏరియాలోని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష మల్లెపూలతో అర్చన చేశారు. 108సార్లు లలిత పారాయణం నిర్వహించారు. సేవా అధ్యక్షురాళ్లు చింతల లక్ష్మి, మాలతి, వేణి లలిత, బాల, మాధవి జీఎంలు చింతల శ్రీనివాస్, ఎల్వీ సూర్యనారాయణ, సుధాకర్, కార్పొరేట్ జీఎం రవికుమార్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

గోదావరిఖనిటౌన్: నగరంలోని బస్టాండ్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, 15వ వార్షిక వేడుకలు కనుల పండువలా నిర్వహించారు. వేద పండితులు గోవర్ధనగిరి జగన్నాథచార్యులు, కలివెండి శేషుకుమార్, కంజర్ల వెంకన్న, రాజేశ్వరభవన్ సురేశ్‌శర్మ కల్యాణం నిర్వహించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత, ఆలయ కమిటీ సభ్యులు అచ్చె వేణు, గోటికార్ శ్రీనివాస్, దేవి లచ్చయ్య, కోటేశ్వరరావు, శంకర్, వెంకన్న, కొమురయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.